# "నిన్ను ఒప్పించడానికి ఏమి కావాలి?"

## చదువుటకు నియమించినవి #43

VIII. క్రీస్తు పునరుత్థానము, ప్రత్యక్షతలు, ఆరోహణం (కొనసాగింది).
- A. ఆదివారం: క్రీస్తు పునరుత్థాన దినం (కొనసాగింది).
  7. అయిదవ ప్రత్యక్షత: (తోమా లేనప్పుడు) అపొస్తలులకు (మార్కు 16:14; లూకా 24:36–43; యోహాను 20:19–25).
- B. నలువది దినములు (అపొ. 1:3).
  1. ఆరవ ప్రత్యక్షత: అపొస్తలులందరికి (ఒక వారం తరువాత యూదయలో) (యోహాను 20:26–31; 1 కొరింథీ. 15:5).
  2. ఏడవ ప్రత్యక్షత: నలువది దినాల కాలంలోనే గలిలయలో కనీసం ఏడుగురు శిష్యులకు (యోహాను 21:1–24).

### పరిచయం

అపొస్తలుల కార్యాలకు లూకా యిచ్చిన పరిచయంలో, "యేసు తాను ఏర్పరచుకున్న అపొస్తలులు" అని లూకా అన్నాడు (అపొ. 1:2). "ఆయన శ్రమపడిన తరువాత నలువది దినములవరకు[2] వారికగపడుచు, దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచు, అనేక ప్రమాణములను చూపి వారికి తన్నుతాను సజీవునిగా కనుపరచుకొనెను" అని కూడా అతడు తెలిపాడు (అపొ. 1:3). నలువది దినములెందుకు? తన ఆరోహణానికి ముందుగా వారికి అప్పగింపవలసిన బాధ్యతలు, చేయవలసిన ఉపదేశము ప్రభువునకు యింకా ఉంది గనుక ఆయన తిరిగి సజీవుడైయున్నట్టు, ఆయన నిజంగా జీవించియున్నట్టు తన అపొస్తలులను ఒప్పించడానికి అవసరమైనంత సమయం ఆయనకు కావలసి యుంది. వారి మనస్సుల్లో ఏ విధమైన సందేహం నిలువకుండవలెనని ఆయన కోరుకున్నాడు.

చివరి నలువది దినాల కాలంలో, క్రీస్తు ప్రభువు అనేకసార్లు తన శిష్యులకు కన్పించియుండవచ్చు. వీటిలో పది ప్రత్యక్షతలు దాఖలు చేయబడ్డాయి; వాటిలో అయిదు ఆయన లేచిన దినానికి సంభవించినవే. ఈ అయిదింటిలో నాల్గింటిని చర్చించుకున్నాము: మగ్దలేనే మరియకు, తక్కిన స్త్రీలకు, పేతురుకు, ఎమ్మాయు మార్గములోని యిద్దరు మనుష్యులకు అనే అయిదింటిలో నాల్గింటిని చర్చించుకున్నాం. ఈ పాఠంలో,[3] తన పునరుత్థాన దినంలో ప్రభువు యిచ్చిన అయిదవ దర్శనాన్ని చూద్దాం. తరువాత యింకా రెండు ప్రత్యక్షతలను చూద్దాం. మనం చూడబోయే ఈ మూడు ప్రత్యక్షతలు ప్రాథమికంగా

తన అపొస్తలుల ప్రయోజనం కొరకే, ప్రభువు వారిని ఒప్పించే ప్రమాణములను తన పునరుత్థానానికి యిచ్చారు. క్రీస్తు సజీవుడైయున్నాడని ఆ పదునొకండగురుని ఏది ఒప్పించింది? నేడు ప్రజలను “ఒప్పించేది ఏది?”

## పదిమంది అపొస్తలులను ఒప్పించినదేమి

## (మార్కు 16:14; లూకా 24:36-43; యోహాను 20:19-25)

ఆయన మృతులలోనుండి లేచినట్టు రుజువు చేయడానికి క్రీస్తు అంచెలంచెలుగా ముందుకు సాగారు. మొదట, దూత ఆయన పునరుత్థానాన్ని ప్రకటించిన వార్త వారికి అందింది. తరువాత పునరుత్థాన ప్రభువును చూచినట్టు యితరులు వారికి తెలిపారు, అయినప్పటికి అపొస్తలులు యింకను తమ విశ్వాసంతో పెనుగులాడుతూనే ఉన్నారు. చివరిగా, వారి సమస్త సందేహాలను తొలిగించడానికి గాను ప్రభువు వారికే వ్యక్తిగతంగా కన్పించారు.

**అపొస్తలులను ఒప్పించారు**

యోహాను ప్రకారం అది “ఆదివారం సాయంకాలమున” (యోహాను 20:19ఏ). యూదుల కాల కొలమానం ప్రకారం (సూర్యాస్తమయమునుండి సూర్యాస్తమయమువరకు), ఇది వారంలో రెండో దినమై యుండేదే, కాని, మనం చూచినట్టే, యోహాను రోమీయుల కాల కొలమానాన్ని వినియోగించాడు (వారు మధ్యరాత్రినుండి మధ్యరాత్రివరకు).[4] క్రీస్తు అపొస్తలులకు ప్రత్యక్షమయ్యింది వారంలో మొదటి దినం, పునరుత్థాన దినం అని చూపడం యోహానుకు ముఖ్యముగా ఉన్నట్టు కన్పిస్తుంది.[5]

అపొస్తలులు ఎక్కడ బసచేస్తున్నారో మనకు తెలియదు;[6] అది ఎక్కడైనా సరే, “యూదులకు భయపడి” వారున్నచోట తలుపులు బిగించుకొని లోపల ఉన్నారు (యోహాను 20:19బి). ఇతర శిష్యులు కూడా అక్కడున్నారు (లూకా 24:33, 36), అయితే ఆయన అపొస్తలులే ప్రభువుకు ప్రధానమైన అక్కర (మార్కు 16:14 చూడు). ఆ సాయంకాలం ఆ పదునొకండుగురు ఒక్క చోట ఉన్నారు (మార్కు 16:14) – ప్రభువు ప్రత్యక్షమయ్యే సమయానికి తోమా తప్ప అందరు అక్కడున్నారు (యోహాను 20:24).

అపొస్తలులు అప్పుడు “భోజనానికి కూర్చున్నారు” (మార్కు 16:14ఏ).[7] క్లెయొపాయు అతని సహచరుడును దారిలో తమకు ప్రభువు కనబడిన సంగతి చెప్పుటకు ఉత్సాహంగా అక్కడికి చేరుకున్నప్పుడు వారు తమ సాయంకాలపు భోజనాన్ని ఆరంభించినట్టున్నారు (లూకా 24:41, 42 చూడు; మార్కు 16:12, 13; లూకా 24:33–35).

ప్రభువును చూచినట్టు చెప్పిన వారి మాటలను (లూకా 24:34), మరి కొందరు నమ్మలేదు (మార్కు 16:13).[8] తీవ్రమైన వాగ్వాదము లేక చర్చ జరుగుతూ ఉన్నట్టుంది – అంతలో – “యేసు తానే స్వయంగా వారి మధ్యను నిలిచి” (లూకా 24:36), “మీకు సమాధానము కలుగును గాక అని వారితో చెప్పెను” (యోహాను 20:19సి).

"అయితే వారు దిగులుపడి భయాక్రాంతులై, భూతము తమకు కనబడెనని తలంచిరి" (లూకా 24:37).[9] నమ్మడానికి వారు వెనుకంజవేయడాన్ని చూచి, "వారి అపనమ్మిక నిమిత్తమును హృదయ కాఠిన్యము నిమిత్తమును" ఆయన వారిని గద్దించారు (మార్కు 16:14బి). ఇద్దరు పురుషులు, రమారమి ఆరుగురు స్త్రీల నోటనుండి సాక్ష్యం విన్నారు; వారికి రుజువు లేకుండా పోలేదు. "అప్పుడాయన – మీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల?" అని వారినడిగారు (లూకా 24:38).

వారి అనుమానాలను పారద్రోలడానికే ఆయన అక్కడికి వచ్చారు. "నేను ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి, నా కున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును భూతమున కుండవని చెప్పి" (లూకా 24:39), "తన చేతులను పాదములను వారికి చూపెను" (లూకా 24:40బి). రోమా సీలల గురుతులు వాటికున్నాయి (యోహాను 20:25, 27). "ఆయన తన ప్రక్కను కూడా వారికి చూపారు" (యోహను 20:20ఎ) అక్కడ బల్లెపుపోటుతో చేయబడిన గాయముంది (యోహాను 20:25, 27 చూడు).

అప్పుడు శిష్యులు "ప్రభువును చూచి సంతోషించిరి" (యోహాను 20:20బి) – అయినా వారి అంతర్గత పోరాటము కొనసాగుతూనే ఉంది. ఎందుకంటే, క్రీస్తు సజీవుడై యుండడం నమ్మశక్యముకాని వాస్తవంగా నిలిచింది. లూకా దాన్ని యిలా చూపాడు: ‘‘అయితే వారు సంతోషముచేత ఇంకను నమ్మక’’ (లూకా 24:41ఎ). తానే ఆయనయనియు, యిందులో ఏ విధమైన సందేహానికి తావులేదనియు రుజువు చేసికొనడానికి గాను "ఆయన – ఇక్కడ మీయొద్ద ఏమైన ఆహారముకలదా అని వారినడిగెను" (లూకా 24:41బి). "వారు కాల్చిన చేపముక్కను ఆయన కిచ్చిరి; ఆయన దానిని తీసికొని వారియెదుట భుజించెను" (లూకా 24:42, 43).

వారికి కావలసిన చివరి సాక్ష్యపు పలుకు అదే. "యేసు – మరల మీకు సమాధానము కలుగును గాక," అని అన్నారు (యోహాను 20:21ఎ). వారి హృదయాలు సమాధానం పొందాయి; వారి ప్రభువు సజీవుడైయున్నారు (యోహాను 20:25ఎ)!

**అపొస్తలులను ఆదేశించారు**

వారికి ప్రత్యక్షమౌతున్న నలువది దినాల కాలంలో తన అపొస్తలులకు ప్రభువు ఎక్కువ ఉపదేశం చేస్తున్నారు కాని (అపో. 1:3 చూడు) దీనంతటిలో ఆయన గ్రేట్ కమిషన్ అతి ముఖ్యమైనది (మత్తయి 28:19, 20; మార్కు 16:15, 16). తాను సజీవుడైయున్నట్టు క్రీస్తు తన శిష్యులను ఒప్పించిన తరువాత, తన తరువాత పలుకులలో వారే తన ఆదేశాన్ని జారీచేసి దాన్ని వారు కొనసాగించేలా ఆయన ఎదురు చూచారు.

తన ఆదేశాన్ని నెరవేర్చడంలో అనుసరించవలసిన విధానాన్ని గూర్చి ఆయన యిలా పలికారు: "... తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నా"ను (యోహాను 20:21బి).[10] "అపొస్తలుడు" అనే మాటకు "పంపబడినవాడు" అని అర్థం. వారిని "పంపిన" వివరాలు తరువాత ఇచ్చారు (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16).

తన ఆదేశాన్ని కొనసాగించడానికిగాను వారు పైనుండి శక్తి పొందుదురని ఆయన అన్నారు: "ఆయన ఈ మాట చెప్పి వారిమీద ఊది – పరిశుద్ధాత్మను పొందుడి" అని చెప్పారు (యోహాను 20:22). క్రీస్తు వారిమీద ఊదగానే అపొస్తలులు పరిశుద్ధాత్మతో నిండలేదు. పరశుద్ధాత్మను అనుగ్రహించుట ఇంకా భవిష్యత్తులో జరుగనుంది (లూకా 24:49; యోహాను 7:39; అపొ. 1:4, 5, 8; 2:4) ఎన్నో వారాల[11] తరువాత జరుగనున్న పరిశుద్ధాత్మ కుమ్మరింపుకు ఇది దృశ్యరూపమైన సూచన. యూదుల పెంతకొస్తు దినాన అపొస్తలులు తీసుకునే పరిశుద్ధాత్మలో బాప్తిస్మం వారికి లోకవ్యాప్తంగా సువార్తను చాటే బలాన్నిస్తుంది.[12]

ఈ ఆదేశాన్నిచ్చే ఉద్దేశమేదో ఆయన తెలిపారు. "మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికి క్షమింపబడును; ఎవరి పాపములు మీరు నిలిచియుండనిత్తురో అవి నిలిచియుండునని వారితో చెప్పెను" (యోహాను 20:23).[13] కొందరిని క్షమించి, కొందరిని క్షమించక తమకు యిష్టం వచ్చినట్టు తీర్మానిస్తారని దాని అర్థం కాదు. కాని, దైవప్రేరేపితమైన అపొస్తలుల బోధయందు పాపక్షమాపణ అనుగ్రహింపబడే విధానాన్ని గూర్చి ప్రభువు యిక్కడ సూచించారు. వారి బోధను అంగీకరించి విధేయులైనవారు క్షమించబడగా, వారి ఉపదేశాన్ని నిరాకరించేవారు పాపక్షమాపణ పొందలేరు (అపొ. 2:36–38, 41, 47).

### అపొస్తలులకు సవాలు

ముందుగా మనం అనుకున్నట్టే. "యేసు వచ్చినప్పుడు, పండ్రెండు మందిలో ఒకడైన దిదుమ,[14] అనబడిన తోమా వారితో లేక పోయెను" (యోహాను 20:24). గైరుహాజరైన అపొస్తలుడు తిరిగి వచ్చినప్పుడు, తక్కిన శిష్యులు "మేము ప్రభువును చూచితిమని" (యోహాను 20:25ఎ) అతనితో చెప్పగా అతడు "నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను" (యోహాను 20:25బి).

## ఒక అపొస్తలుని ఒప్పించడానికి ఎంత జరిగింది

## (యోహాను 20:26-31; 1 కొరింథీ. 15:5బి)

ఒక వారం గడిచిపోయింది. గలిలయకు వెళ్లుడని అపొస్తలులకు చెప్పారు (మత్తయి 28:10) అయితే వారు తమ పయనానికి జాగు చేశారు. తోమా నమ్మనంత కాలం, వారు వెళ్లడానికి సిద్ధంగాలేరు – ఎందుకంటె వారి హృదయాలు విశ్వాసంతో యింకను ఏకం కాలేదు.[15] మరోసారి వారికి ప్రత్యక్షమవ్వడానికి ప్రభువు ఒక వారం ఎందుకు వేచియున్నారో తెలియదు. తాము చూచిన వాటిని గూర్చి తన అపొస్తలులు ఆలోచించుకుంటారని కాబోలు.

**"చూడడం నమ్మడమే"**

చివరిగా, "ఎనిమిది దినములైన తరువాత[16] ఆయన శిష్యులు మరల లోపల ఉన్నప్పుడు తోమా వారితో కూడ ఉండెను" (యోహాను 20:26ఎ). అప్పుడు ప్రభువు మరో మారు ప్రత్యక్షమయ్యారు (1 కొరింథీ. 15:5బి). ముందువారంలో పరిస్థితులు ఎలాటివో (తలుపులు మూసియుండగా) నేడును అట్టివే. ప్రభువువారి పలకరింపు కూడా మారలేదు: "మీకు సమాధానము కలుగును గాక" (యోహాను 20:26బి).

ఈ ప్రత్యక్షత ప్రత్యేకించి తోమాకొరకే. ఆయన తోమాను చూచి – "నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి అవిశ్వాసివి కాక విశ్వాసివైయుండుమనెను" (యోహాను 20:27). తోమా ప్రత్యుత్తరము "సత్వరమైనది, గ్రహింపుతోకూడినది, నిజముగా బహు గంభీరమైనది; క్రీస్తు దైవత్వాన్ని ఒప్పుకొనడం సంపూర్తియైనది ... నిస్సందేహాస్పదమైన పదములతో కూడింది":[17] "నా ప్రభువా, నా దేవా"[18] (యోహాను 20:28) J. W. McGarvey యిలా రాశాడు,

> అతని సందేహాలు అత్యంత భారమైనవైతే, అతని విశ్వాసపు ఒప్పుకోలు బహుగా సంపూర్ణమైనదని తోమాకు అనుకూలంగా చెప్పవలసియుంటుంది. పునరుత్థానం పట్ల అతనికి అధికమైన సందేహాలున్నాయి ఎందుకంటే అదంటే అతనికి ఎంతో ఎక్కువైన భావన ఉండేది; దాని అర్థం యేసు దేవుడు అనే దానికంటె అతనికి వేరు అర్థం లేదు.[19]

**"నమ్మడమంటే చూడడమే"**

"యేసు – నీవు నన్ను చూచినమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులని అతనితో (తోమాతో) చెప్పెను" (యోహాను 20:29ఎ). ఆ గద్దింపు తోమాకు ఉద్దేశింపబడింది గాని, అపొస్తలులకందరికది వర్తిస్తుంది (మార్కు 16:14 చూడు). ఆయనను చూచేవరకు వారిలో ఒక్కడును ఆయనయందు నమ్మికయుంచ లేదు.

దానితో ప్రభువు యిలా అన్నారు: "చూడకనమ్మినవారు ధన్యులు" (యోహాను 20:29బి) ఈ మాటలతో, ఆయనను ప్రత్యక్షంగా చూడకుండనే ఆయన పునరుత్థానాన్ని నమ్మినవారు ధన్యులని ప్రభువు ప్రకటించారు.[20] మన భౌతిక నేత్రాలతో ప్రభువును చూడకయే ఆయన పునరుత్థానమును నమ్మిన మనకును ఆ దీవెన వర్తిస్తుంది. ప్రభువు ఈ మాటలు పలుకగా వినిన పేతురు తరువాత యిలా రాశాడు, "మీరాయనను చూడకపోయినను ఆయనను ప్రేమించుచున్నారు; ఇప్పుడు ఆయనను కన్నులార చూడకయే విశ్వసించుచు, మీ విశ్వాసమునకు ఫలమును, అనగా ఆత్మరక్షణ పొందుచు, చెప్పనశక్యమును, మహిమాయుక్తమునైన సంతోషముగలవారై ఆనందించుచున్నారు" (1 పేతురు 1:8).

మనకొక పాత సామెత ఉంది: "చూడడమంటే నమ్మడమే." ఇంకోవిధంగా, దాన్ని తిరగదిప్పినా సత్యమే: "విశ్వసించడమంటే చూడడమే." ప్రభువునందు మనం విశ్వాసముంచినపుడు, మన జీవితాన్ని మరోవిధంగా "చూస్తుం"టాం; గ్రహించుతాం;

మనం “చూస్తాం.” జీవితమంటే ఏమిటో అర్థం చేసికొంటాం. అప్పుడు “చెప్పనశక్యమును మహిమాయుక్తమునైన సంతోషము గలవారమై ఆనందిస్తాం.”

మన భౌతికమైన నేత్రాలతో ప్రభువును చూడలేక పోయినప్పుడు, మనం ఆయనను ఎలా నమ్మగలం? దైవప్రేరేపణ వ్యాఖ్యానంలో యోహాను ఆ ప్రశ్నకు యిలా జవాబిచ్చాడు, “మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అని ఈ [యోహాను] గ్రంథమందు వ్రాయబడియుండలేదు” (యోహాను 20:30; 21:25 కూడా చూడు). అనేకమైన “యితర సూచక” క్రియలు యోహాను గ్రంథమందు రాయబడనివి మత్తయి, మార్కు, లూకాలో రికార్డయ్యాయనే వాస్తవం ఇందువల్ల తెలిసివస్తుంది.

అయినా యోహాను యిలా తన భావనను కొనసాగించాడు, “గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను” (యోహాను 20:31).[21] యోహాను ఆలోచనను బట్టి, క్రీస్తు జీవితాన్ని గూర్చి దాఖలు చేయబడ్డ సందేశం రక్షించు విశ్వాసాన్ని కలిగించడానికి చాలినదైయుంది. అపొస్తలుల వాక్యము ద్వారా తనయందు విశ్వాసముంచేవారిని గూర్చి క్రీస్తు ప్రభువు ముందుగానే పలికారు (యోహాను 17:20). తరువాత కాలంలో పౌలు యిలా రాశాడు, “కాగ వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును” (రోమా 10:17). క్రొత్త నిబంధనలోని దైవప్రేరేపితమైన సాక్ష్యమును బట్టి తమ భౌతికమైన నేత్రాలతో చూడకపోయినా ప్రభువైన యేసునందు విశ్వాసముంచువారు ధన్యులు!

## ఏడుగురు శిష్యులను ఒప్పించడానికి ఏమి కావలసి వచ్చింది (యోహాను 21:1-24)

ఇప్పుడు దృశ్యం యూదయనుండి గలిలయకు మళ్ళింది. ఆయన వారిని గలిలయలో కలిసికొనుమని యేసు తన శిష్యులకు తెలిపారు (మత్తయి 26:32; 28:7). “మూడవ సారి”[22] గలిలయలోని తిబెరియ సముద్రతీరమున “శిష్యులకు మరల తన్ను ప్రత్యక్షపరచుకొనెను” (యోహాను 21:1, 14), “గలిలయ సముద్రానికి” అది మరియొక పేరు (యోహాను 6:1).[23] ఈ సంఘటన నిజంగా ఎక్కడ సంభవించిందో మనకు తెలియదు. “ఈ సంగతులు జరిగిన పిమ్మట” అంటే, యూదయలో అపొస్తులులకు రెండు మార్లు ప్రత్యక్షమైన తరువాత, అది జరిగినట్టు యోహాను 6:1 అంటుంది. నలువది దినాల్లో ఎప్పుడో యిది జరిగింది.

### అపొస్తులులలోని కొందరికి జ్ఞప్తికి తెచ్చారు

ఏడుగురు శిష్యులు కలిసి గలిలయ సముద్రమునొద్దకు చేరుకున్నారు: “సీమోను పేతురును, దిదుమ అనబడిన తోమాయు, గలిలయలోని కానా అను ఊరివాడగు నతనయేలును,[24] జెబెదయ కుమాళ్లును [యాకోబు, యోహానులు], ఆయన శిష్యులలో

మరి ఇద్దరును కూడి యుండిరి" (యోహాను 21:2).[25] అపొస్తలులకు అది ఎరుకైన చోటే. క్రీస్తు ప్రభువు జీవితంలో అనేకమైన గొప్ప సంభవాలు ఈ సముద్రములోనో, దాని సమీపప్రాంతాల్లోనో జరిగాయి.[26] ప్రభువు వారికి సంపూర్ణంగా శిష్యులుకాకమునుపు పేతురు, యాకోబు, యోహానులు యిక్కడ చేపలు పట్టేవారు (మత్తయి 4:18-22).

ఆ శిష్యులు ఆ చోటుకి వచ్చి చాలాకాలమైయుండవచ్చు. పేతురులో చికాకు ఎక్కువైంది. "నేను చేపలు పట్టబోదునని" వారితో అనగా (యోహాను 21:3ఎ). వారు, "మేముకూడా నీతో కూడ వచ్చెదమనిరి" (యోహాను 21:3బి). ఈ మనుష్యులు తమ అపొస్తలత్వాన్ని వదులుకొన్నట్టు కొందరు దీనికి అర్థం చెప్పారు. భవిష్యత్తులో వారికొరకు ప్రభువు ఎట్టి ఏర్పాటు కలిగియున్నారో ఎరుగక వారు ఈ విషయంలో పొరబడి యుండవచ్చు. అపొస్తలులు తమ కర్తవ్య నిర్వహణలో వెన్ను చూపారని మనం అనుకోకూడదు, Philip Pendleton యిలా రాశాడు,

> చేపలు పట్టవెళ్లినంత మాత్రాన వారు తమ అపొస్తలత్వాన్ని వదులుకోలేదు; వారు జరుగబోయే పరిణామాల కొరకు నిరీక్షిస్తూ, వేచి ఉన్నారు, అయితే తమ పాత వృత్తికి తిరిగి రావడంవలన బలీయమైన శోధనకు వారు తమ్మును లోబరచుకొంటున్నారు [లూకా 9:62].[27]

"వారు వెళ్లి దోనె ఎక్కిరి;[28] కాని ఆ రాత్రి[29] యేమియు పట్టలేదు" (యోహాను 21:3సి). ఎంత నైపుణ్యంగల బెస్తవానికైనా ఇటువంటి దినాలు ఎదురౌతాయని చేపలు పట్టేవాడెవడైనా చెప్తాడు!

"సూర్యోదయమగుచుండగా, యేసు దరిని నిలిచెను" (4ఎ వ.); అయితే తీరము నుండి రమారమి వంద గజాల[30] దూరంలో (8 వ.). ఉన్న శిష్యులు ఆయనను గుర్తుపట్టలేదు (4బి వ.).[31] "యేసు పిల్లలారా,[32] భోజనమునకు మీయొద్ద ఏమైన ఉన్నదా?" అని అడుగగా, "లేదని" వారాయనతో చెప్పిరి (5 వ.).

అప్పుడాయన, "దోనె కుడిప్రక్కను వలవేయుడి మీకు దొరకునని చెప్పెను" (6ఎ వ.) అందుకు వారు ఏమనుకున్నా, "ఆయన చెప్పినట్టు వారు చేశారు. అలా చేయగా, వారి వలనిండి, చేపలు విస్తారముగా పడినందున వల లాగలేకపోయిరి" (6బి వ.). "అది నూట ఏబదిమూడు గొప్ప చేపలతో నిండియుండెను" (11 వ.[33]).

తక్కినవారు ఆశ్చర్యపడుతుండగా,[34] యోహానైతే దాదాపుగా మూడు సంవత్సరాలకు ముందు ఈలాటి మరొక సంఘటనను జ్ఞాపకమునకు తెచ్చుకున్నట్టున్నాడు: అది ప్రభువు అతనితో యింకా ముగ్గురిని సంపూర్ణంగా సువార్త చేయుటకై పిలిచిన సందర్భం (లూకా 5:1-11). "ఆయన ప్రభువు సుమీ అని పేతురుతో చెప్పెను" (యోహాను 21:7ఎ). అప్పుడు అతని స్వరంలో ఉన్న ఉత్సాహాన్ని నేను వినగలను.

"ఆయన ప్రభువని సీమోను పేతురు విని, వస్త్రహీనుడైయున్నందున పైబట్ట వేసికొన్నాడు" (7బి వ.). చేపలు పట్టడానికని పైవస్త్రం తీసి ఉంటాడు, యిప్పుడు దాన్ని మరల వేసికొన్నాడు.[35] పైవస్త్రం వేసికొని ఈదడం కష్టమైనా,[36] తన యజమానుని పైనున్న గౌరవం కొలది అలా చేశాడు. దోనె దరికి వచ్చేవరకు అతడు వేచియుండలేదు. "అతడు నీళ్లలోనికి

దూకాడు" (7సి వ.). అతడు ఈదుకొంటూ ప్రభువు నొద్దకు వస్తుండగా, తక్కినవారు "దోనెలో ఉండి,[37] ... చేపలతోనిండిన వలను దరికి లాగుకొని వచ్చారు" (8 వ.).

వారు దరికి చేరినప్పుడు, "అక్కడ నిప్పులును వాటిమీద ఉంచబడిన చేపలును రొట్టెయు కనబడెను" (9 వ.).[38] తాను అప్పటివరకు కాలుస్తున్న వాటికి తోడు వారు పట్టి తెచ్చిన కొన్ని చేపలను చేర్చి ఉండవచ్చు (10, 11 వచనాలు), సమస్తము సిద్ధమైయుండినప్పుడు, "యేసు – రండి భోజనము చేయుడని వారితో చెప్పెను" (12ఎ వ.). ఆయన "ఆ రొట్టెను తీసికొని వారికి పంచిపెట్టెను" (13 వ.). ఆయన "ప్రభువనియు ఆయన సజీవుడైయున్నాడనియు" (12బి వ.) అందరు చూడగలిగారు![39]

## పునరుద్ధరింపబడిన అపొస్తలుడు

గత ప్రత్యక్షతలో ఎలాగు తోమా ప్రభువుయొక్క ప్రాథమిక దృష్టికి కేంద్రమైయున్నాడో అలాగే యిక్కడ పేతురు కూడా. అపొస్తలులందరిలో, భవిష్యత్తును గూర్చి పేతురే అనిశ్చయంగా ఉన్నాడు. "తన్ను ఎరుగనని నేనన్నదానికి ప్రభువు నన్నెప్పుడైనా క్షమిస్తారా? ఆయన ఏర్పాట్లలో నాకేమైనా స్థానం ఉంటుందా" అని అతడు ఆలోచిస్తున్నట్టు నేను ఊహించగలను. ఉదయ కాలపు భోజనానంతరం (15ఎ వ.), క్రీస్తు తక్కిన వారియొద్దనుండి ఈ అపొస్తలుని దూరంగా తీసికొనిపోయాడు.[40] అక్కడ ఉద్వేగంతో కూడిన దృశ్యం ఆరంభమయ్యింది.

"– యోహాను కుమారుడవైన సీమోనూ, వీరికంటె నీవు నన్ను ఎక్కువగా ప్రేమించు చున్నావా?" అని ప్రభువు మొదటిగా అతని నడిగారు (15బి వ.). "వీరికంటె" అంటే అక్కడున్న యితర శిష్యులకంటె అని కొందరు భావించారు; అయితే పేతురు అందరికంటె ఎక్కువ నమ్మకత్వం గలవాడనని ముందుగా చెప్పుకున్నాడు (మత్తయి 26:33). కొందరైతే, చేపలు. చేపలకు కావలసిన పరికరాలు అని తలంచారు; తన నిరాశలో, పేతురు తన గత వృత్తికి తిరిగి వెళ్లాలని ఆలోచిస్తున్నాడేమో, ప్రభువు ఒకవేళ దాన్ని చూస్తున్నారేమో. "వీరందరు" అని అన్నదాని భావాన్ని మనం తేల్చుకోవాలి. ప్రభువు ప్రశ్నకు భావమేమంటే – "అందరికంటెను అన్నిటికంటెను నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా?" అనేది. ఈ ప్రశ్ననే మనమందరం మనలను అడుగుకొనవలసి ఉంటుంది.

పేతురు – "అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను" (యోహాను 21:15సి). ఈ ప్రశ్న అడుగడంలో, క్రీస్తు *agapao* అనే గ్రీకు పదాన్ని వినియోగించారు. "ప్రేమ" అనే దానికి అత్యున్నతమైన పదమది, "దేవుడు ప్రేమయైయున్నాడు" అని యోహాను రాసినప్పుడు, *agapao* అనే పదాన్ని ఉపయోగించాడు (1 యోహాను 4:8). ప్రేమ యొక్క ఔన్నత్య స్థితిని గూర్చి పౌలు రాసినప్పుడు పౌలు ఈ పద రూపాన్నే ఉపయోగించాడు (1 కొరింథీ. 13). ఏదియెలాగున్నా, పేతురు ఈ ప్రశ్నకు జవాబు చెప్పినప్పుడు, అతడు *phileo* అనే "ప్రేమకు" తక్కువైన పదాన్ని ఉపయోగించాడు – ఈ పదం ఆప్యాయతను స్నేహబంధాన్ని చూపుతుంది.[41] ఇంతకు, "నీవు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?" అని అడిగితే, "ప్రభువా, నేను నీ స్నేహితుడనని నీవే ఎరుగుదువు" అన్నట్టు జవాబు వచ్చింది.[42] "ఒకసారి

పడిపోయిన తరువాత *agape*[43] అనే పదం సూచించే అత్యున్నతమైన స్థాయిలో తాను సమర్పణ కలిగియున్నట్టు తాను చెప్పుకోలేక పోతున్నట్టున్నాడు."[44] "నా గొఱ్ఱె పిల్లలను మేపుమని," ప్రభువు అతని జవాబుకు బదులుగా చెప్పారు (15డి వ.).

"మరల ఆయన – యోహాను కుమారుడవైన సీమోనూ, నన్ను ప్రేమించుచున్నావా? అని రెండవసారి అతనిని అడిగారు" (16ఎ వ.). అందుకతడు, "అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను" (17బి వ.). ఆయన, "నా గొఱ్ఱెలను కాయుమని చెప్పెను" (17సి వ.).

"మూడవసారి ఆయన – యోహాను కుమారుడవైన సీమోనూ, నన్ను ప్రేమించు చున్నావా? అని అతనిని అడిగెను" (17ఎ వ.). ఈసారి "ప్రేమ" అనేదానికి పేతురు వినియోగించిన పదాన్నే ప్రభువు కూడా వినియోగించారు: అంటే, "నీవు నిజంగా నా స్నేహితుడవేనా?" అన్నట్టు. మూడవసారి ప్రభువు అతనిని యిలా అడిగినందుకు "వ్యసనపడి" "ప్రభువా, నీవు సమస్తము ఎరిగినవాడవు, నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను" (17బి వ.). అందుకు ప్రభువు "నా గొఱ్ఱెలను మేపుము" అన్నారు (17సి వ.).

ఆయనను ఎరుగనని పేతురు మూడుసార్లు అన్నదానిని రద్దుపరచడానికి ముమ్మారు అతడు తన ప్రేమను ఒప్పుకొన్నాడని రచయితలు అన్నారు – అది వాస్తవమైయుండవచ్చు. కనీసం ప్రభువు తన్ను విసర్జించలేదన్న ఒక విషయం పేతురుకు విదితమైయుంటుంది. తాను ప్రభువు కొరకు చేయవలసిన ప్రముఖ కార్యముంది. అపొస్తలుడు చేయవలసిన పనిని – "నా గొఱ్ఱెపిల్లలను మేపుము," "నా గొఱ్ఱెలను కాయుము," "నా గొఱ్ఱెలను మేపుము" అనే మాటలతో ఆయన సూచించారు (15–17 వచనాలు). సంఘపు ఆరంభ దినాల్లో, "మంద" అంతటికి (దేవుని ప్రజలందరికి)[45] అపొస్తలులు ప్రత్యేక బాధ్యతలతోడు, అతడు ఒక స్థానిక సంఘంలో కాపరులలో ఒకనిగా పని కలిగియున్నాడు (1 పేతురు 5:1–4).

క్రీస్తు తన కొరకు ఏర్పరచిన పాత్రను చేపట్టడానికి పేతురు అంగీకరించియుంటే, దానికి అయ్యే విలువను కూడా అతడు చెల్లింప సిద్ధపడాలి: అది హతసాక్షి మరణం. ప్రభువు పేతురుతో ఈ సందర్భంగా మాటలను యిలా కొనసాగించారు:

> "నీవు యౌవనుడవై యుండినప్పుడు నీ అంతట నీవే నడుము కట్టుకొని నీ కిష్టమైన చోటికి వెళ్లుచుంటివి; నీవు ముసలివాడవైనప్పుడు నీచేతులు నీవు చాచుదువు, వేరొకడు నీ నడుము కట్టి నీ కిష్టము కాని చోటికి నిన్ను మోసికొనిపోవునని నీతో నిశ్చయముగా చెప్పుచున్నానని అతనితో చెప్పెను. అతడు ఎట్టి మరణమువలన దేవుని మహిమ పరచునో దాని సూచించి ఆయన ఈ మాట చెప్పెను. ఇట్లు చెప్పి – నన్ను వెంబడించుమని అతనితో అనెను"[46] (యోహాను 21:17–19).

యేసు చమత్కారముతో కూడిన మాటలను ఉపయోగించారు: 18వ వచనంలో రెండవసారి "నడుము కట్టు" అనే పదములో అతని శత్రువులు ఆ అపొస్తలుని చేతులు బంధించి తన మరణానికి తీసికొని పోతారనే విషయాన్ని ప్రభువు యిక్కడ సూచించారు (మార్కు 15:1తో పోల్చి చూడు). ఈ సంఘటన సంభవించిన ముప్పది నాలుగు

సంవత్సరాల తరువాత తలక్రిందులుగా పేతురు సిలువ వేయబడినట్టు దైవప్రేరేపితముకాని పారంపర్యం అంటుంది.[47] ఆ పారంపర్యం రైటైనా కాకపోయినా, పేతురు ప్రభువు యొక్క సవ్వాలును అంగీకరించితే తన విశ్వాసం నిమిత్తం అతడు ఏదో ఒకనాడు చనిపోతాడని – యోహాను 21:18నుండి విదితమౌతుంది.

పేతురు పునరుద్ధరణకు యోహాను[48] సాక్షియై ఉండడంతో ఈ కథ ముగిసి పోతుంది. యోహాను తన వెంట వస్తున్నట్టు పేతురు గుర్తించి (యోహాను 21:20), "– ప్రభువా, యితని సంగతి ఏమగునని యేసును అడిగెను" (21 వ.). అంటే, "నా విశ్వాసము నిమిత్తము నేను చస్తానని నా సంగతి చెప్పారు, మరి యోహాను సంగతి ఏమి? అతడు కూడా హతసాక్షి మరణమే పొందుతాడా?" తడువుకోకుండ ప్రభువు అతనికి యిలా బదులిచ్చాడు: "– నేను వచ్చువరకు అతడుండుట నాకిష్టమైతే అది నీకేమి? నీవు నన్ను వెంబడించుమనెను!" (22 వ.). తనదికాని విషయాలలో తలదూర్చవద్దని ఆయన పేతురుకు చెప్పారు. యోహానును గూర్చి నీ తల పగలగొట్టుకునే దానికంటే, ప్రభువు తనకు అప్పగించిన పనిలో తాను నమ్మకముగా ఉండునట్లు చూచుకొనడం పేతురు అక్కర కలిగియుండాలని ప్రభువు సూచించారు.

యోహానును గూర్చి ప్రభువు తనకు ఏమి చెప్పారో, పేతురు దానిని యితరులకు తెలిపినట్టున్నాడు. అందునుబట్టి, "ఆ శిష్యుడు చావడను మాట సహోదరులలో ప్రచురమాయెను" (23ఎ వ.). అయితే ప్రభువు అతడు చావడని చెప్పలేదు (23బి). దైవప్రేరేపితముకాని పారంపర్యం ప్రకారం, అపొస్తలులలో ప్రకృతి సిద్ధమైన మరణం పొందినది యోహానే. 90ల్లో,[49] యోహాను సువార్త రచనను రాసియున్నట్టయితే, అతడు 90 ఏండ్ల ప్రాయంవాడై ఉంటాడు. ఆ మాటకు యిది నమ్మదగినతనాన్ని చేకూర్చుతుంది. 20నుండి 23 వచనాలవరకు యోహాను చేర్చిన ఆత్మ ప్రేరేపితమైన వ్యాఖ్యానం వారి మధ్య ఏర్పడిన పుకారును రద్దుపరచడానికి కావచ్చు.

ఈ భాగాన్ని దేవుడు యిందులో ఉంచడానికి దేవుని కారణమేమైయున్నా, ప్రముఖమైన వచనానికి యిది పరిచయముగా పని చేస్తుంది: "ఈ సంగతులను గూర్చి సాక్ష్యమిచ్చుచు ఇవి వ్రాసిన శిష్యుడు ఇతడే; ఇతని సాక్ష్యము సత్యమని యెరుగుదుము" (24 వ.). భాష వింతైనది కాని,[50] సందేశం స్పష్టంగా ఉంది: యోహాను పునరుత్థానుడైన క్రీస్తును చూచాడు గనుక అతని సందేశం నమ్మవచ్చు. క్రీస్తు మృతులలోనుండి నిజంగా లేపబడ్డారు.

## ముగింపు

తన శిష్యులకు ప్రభువైన యేసు "అనేక ప్రమాణములను చూపి వారికి తన్నుతాను సజీవునిగా కనుపరచుకొనెను" యోహాను ఈ సంగతులను, ఇతర సువార్త రచయితలతో పాటు మనము నమ్మునట్టు రాశాడు (యోహాను 20:30, 31). మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్త రచనలలో వ్రాయబడిన సంగతులు నీ హృదయంలో విశ్వాసాన్ని పుట్టించియుండవచ్చు, లేదా విశ్వాసాన్ని అధికం చేసియుండవచ్చునని నా ప్రార్థన.

క్రీస్తు జీవితపు పఠనం నీ జీవితాన్ని తాకకుండ పోయినట్టయితే నిన్ను ఒప్పించడానికి నీకు యింకా ఏమి కావాలి?[51]

## నోట్సు

రెండు భాగాల పాఠంలో యిది మొదటిది. రెండవ భాగం ("క్రీస్తు జీవితం, 7"లో) ఈ రెండు భాగాలను కలిపి ఆరోహణం మీద ఒక ప్రసంగం చిత్రించబడింది. ఈ రెండు పాఠాలను నీవు వేరువేరుగా చెప్పగోరితే, ఒకటవ భాగాన్ని వెంబడించే మరో ప్రసంగం అవసరమైయుంటుంది. గలిలయ సముద్రము ప్రక్కన ప్రభువు ప్రత్యక్షమైన దానిమీద ప్రసంగించు. దానిని "క్రీస్తు ఉదయ భోజనాన్ని వండిన దినము" అని పిలువవచ్చు. పేతురుతో ప్రభువు చేసిన సంభాషణను వివరించవచ్చు.[52]

మరో అవకాశం – తోమాపై శీలానికి సంబంధించిన ప్రసంగం చేయవచ్చు "doubting Thomas" అని లోకంలో ఎక్కువ భాగం అతన్ని పిలుస్తారు[53] "మరణమగునంతగా భయపెట్టబడినప్పుడు నీవు ఏమి చేస్తావు?" అంటూ మూయబడిన తలుపులగుండ ప్రభువు వెళ్లిన సంగతిని ప్రసంగించవచ్చు.[54]

---

సూచనలు

[1]ఆదివారాన జరిగిన ఈ సంభవాన్ని గూర్చి, యోహాను 20:19 పైన కామెంట్స్ చూడు. [2]పస్కా తరువాత 50 రోజులకు పెంతెకొస్తు వస్తుంది. అందులో ప్రభువు 40 రోజులు తన అపొస్తలులకు ప్రత్యక్షమగుతునే వచ్చారు; పెంతెకొస్తుకొరకు వారు 19 దినాలు వేచియుండవలసి యుంటుంది. [3]రెండవ భాగం "క్రీస్తు జీవితం, 7లో" చూడు. [4]యోహాను రోమీయుల కాలమానం ప్రకారం యోహాను సమయాన్ని లెక్కించాడనడానికి యోహాను 20:19యే బలమైన రుజువు. "ఆదివారం సాయంకాలమున" అపొస్తలులకు ప్రత్యక్షమయ్యారనడానికి ఒకే మార్గం, యోహాను రోమీయుల కాల ప్రమాణం ప్రకారం లెక్కించితేనే. [5]వేకువకును సూర్యోదయానికిని మధ్య క్రీస్తువారు తప్పక లేచియుండాలి – అది ఏ కాలమాన ప్రకారమైన – యూదులదైనా, రోమీయులదైనా. [6]ప్రభువు తమతో పస్కాను భుజించిన ఆ మేడగదిలోనికి వారు వెళ్లియుంటారని కొందరి అభిప్రాయం. [7]మార్కు 16:14–19 క్రీస్తు తన అపొస్తలులకు కన్పించడం, గ్రేట్ కమిషన్ యివ్వడం, ఆరోహణం అనేవాటిని కలుపుతుంది. మూడు సంఘటనలు చెకచెక జరిగినట్టు మార్కులో కన్పింస్తుందిగాని, తక్కిన సువార్త రచనలను బట్టి చూస్తే వాటి మధ్య వ్యవధి ఉన్నట్టు కన్పిస్తుంది. [8]"నమ్ముటకు ప్రయాసపడుట" అనే పాఠంలోని చర్చను చూడు. [9]మత్తయి 14:26ను అపొ. 12:15తో పోల్చి చూడు. ఒత్తిడి సమయాలలో పాత మూఢ నమ్మకాలు బయటికి వస్తాయి. [10]యోహాను 17:18 చూడు.

[11]"ఆత్మ" అనే దానికి గ్రీకు పదం *pneuma* "ఊపిరి" అనే అర్థమున్నందున, మనకంటె యిది అపొస్తలులకు ఎక్కువ తేటగా ఉంటుంది. [12]పరిశుద్ధాత్మ వారికి ఏమి జరిగిస్తాడనే దాన్ని గూర్చి "క్రీస్తు జీవితం, 6ను" చూడు. [13]యోహాను 20:23లోని భాష – మత్తయి 16:19; 18:18 వంటిదిగా ఉంది. [14]"తోమా" అనే హెబ్రీ పదానికి దిదుమ అనే గ్రీకు పదానికి "కావలవాడు" అని అర్థం వస్తుంది. [15]యోహాను 17లోని ఆయన ప్రార్థనలో, ఏకత్వముపై ప్రభువు దృష్టినిలిపారు (యోహాను 17:22, 23). అది విశ్వాసులందరికొరకు, అపొస్తలులకొరకు కూడా. [16]NIVలో "ఒకవారం తదుపరి" అని ఉంది. [17]Robert Duncan Culver, *The Life of Christ* (Grand Rapids, Mich.: Baker Book House, 1976), 277. పేతురు యొక్కయు మార్త యొక్కయు ఒప్పుకోలు క్రీస్తు దేవత్వాన్ని చాటుతున్నాయి గాని తోమాది మాత్రం ప్రత్యేకమైయింది. [18]యేసు దేవుడే కాకుండినట్టయితే, ఆయన తోమాను గద్దించేవాడే. దానికి బదులుగా, ఆయన అతని మెచ్చుకున్నాడు. [19]J. W. McGarvey and Philip Y Pendleton, *The Fourfold Gospel or A Harmony*

*of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 754. [20]సమాధియొద్దకు వెళ్లినవారిలో స్త్రీలు కూడా ఉన్నారు. ఆయన వారికి కనబడక ముందే (మత్తయి 28:9, 10) వారు దూత వర్తమానాన్ని నమ్మారు (మత్తయి 28:5–8; లూకా 24:22, 23).

[21]యోహాను 20:30, 31 పుస్తకానికి మంచి ముగింపుగానే ఉండేది. తరువాత 21 చేర్చబడిందని చెప్పబడింది. అయినా, ప్రతి చేతి ప్రతిలోను 21వ అధ్యాయం ఉంది. [22]సమూహంగా ప్రభువు తన అపొస్తలులకు ప్రత్యక్షమయ్యింది యిది మూడవసారి, అనుకో, ఆయన యితర గుంపులకును, వ్యక్తులకును ప్రత్యక్షమయ్యారు. [23]"క్రీస్తు జీవితం, 2"లో గలిలయ సముద్రము చూడు. [24]"నతనియేలు" క్రీస్తుయొక్క తొలి శిష్యులలో ఒకడు (యోహాను 1:43–51). నతనియేలు బర్తలోమయి అనే పేరుక్రింద గుర్తింపబడ్డాడు, "క్రీస్తు జీవితం, 1లో, 2లో"ను చూడు. [25]"యేసు మృతులలోనుండి లేచిన తరువాత శిష్యులకు ప్రత్యక్షమైనది యిది మూడవ సారి" అని యోహాను 21:14 అంటున్నందున, తక్కిన అపొస్తలులు అక్కడ సమీపంగా ఉండే అవకాశం ఉంది – వారు ఉదయ కాలపు భోజనం కొరకు ఆ ఏడుగురిని కలిసికొనియుండవచ్చు. [26]క్రీస్తు ఆ సముద్రపు దరిని ప్రసంగించారు, ఆ సముద్రపు దరినుండి పలువురు శిష్యులను పిలిచారు; ఆ నీటిమీద నడిచారు. [27]McGarvey and Pendleton, 755. [28]ఈ దోనె ఎవరిది? శిష్యులు దాన్ని బాడుగకు తీసికొన్నారా? తెలియదు. [29]గలిలయ సముద్రము చేపల వేట సాధారణంగా రాత్రులందు జరుగుతుంది (లూకా 5:5). [30]గ్రీకులో రెండు వందల మూరల దూరం అని ఉంది.

[31]మరోమారు క్రీస్తు శిష్యులు ఆయనను గుర్తుపట్టలేదు, కారణాలేమైనా సరే. [32]ఇక్కడ ఉపయోగింపబడిన గ్రీకు పదం – "బాలురు" అని; NIVలో "స్నేహితులు" (స్నేహితులారా) అని ఉంది. [33]ఈ సంఖ్య నిక్కచ్చిగా యివ్వడం అసాధారణం. ఇది కేవలం చేపలుపట్టేవారి కట్టుకథ కాదని యోహాను తెలుపగోరినట్టున్నాడు. అన్నిపెద్ద చేపలుపడినా వల పిగలకపోవడం అద్భుతములో భాగమైయుండవచ్చు. [34]ముందుగా జరిగిన ఈలాటి సంధర్భంలో, అద్భుతముగా పట్టిన ఆ చేపలను బట్టి ఆశ్చర్యపోయారు (లూకా 5:9). [35]"వస్త్రహీనుడ"ని గ్రీకు మూలంలో ఉంది (KJV చూడు). "వస్త్రహీనుడనే" ఈ సందర్భంలో "చాలినంత వస్త్రము లేనివాడని" అర్థం. ప్రభువును ఆహ్వానించేటప్పుడు చాలీచాలని బట్టతో ఉండడం పేతురు యిష్టపడనట్టున్నాడు. [36]"నీ వస్త్రాన్ని తీసివేసి, పనికి వెళ్ళు" అనే సామెత అమెరికాలో ఉంది. [37]"చిన్న దోనె" అనేదానిలోనే వారు చేపలు పట్టుతూ ఉండియుండవచ్చు. [38]ప్రభువుకు రొట్టె ఎక్కడనుండి వచ్చిందో, చేప ఎక్కడనుండి వచ్చిందో చెప్పబడలేదు. [39]ఆయన ఎవరని ప్రశ్నించడానికి శిష్యులలో ఎవరును సాహసించలేదు – ఎవరి ఊహతోను మనకు పనిలేదు. [40]యోహాను "వారి వెంట" వచ్చాడంటే, యితరులకంటే ప్రభువును పేతురును ముందుగా సాగిపోతున్నారు.

[41]David L. Roper, *Getting Serious About Love* (Searcy, Ark.: Resource Publications, 1992), 20-27, 34, 35. [42]"అవును, ప్రభువా, … నేను నీ స్నేహితుడనని నీవే ఎరుగుదువు" అని The Living Bible అంది. [43]*Agape* అనేది *Agapao*కు నామవాచక రూపం. [44]Roper, 35. [45]వారు "ప్రధాన కాపరియైన" క్రీస్తుకు దేవుడు నియమించిన ప్రతినిధులు (1 పేతురు 5:4). [46]మొదటిలో ప్రభువు పేతురుకు పలికిన సవాలు "నన్ను వెంబడించు" (మత్తయి 4:19); అది యింకను "నన్ను వెంబడించు"మనే సవాలే (యోహాను 21:19, 22). ప్రతి స్త్రీ పురుషునికిని, లెక్కచెప్పవలసిన ప్రతి యువతి యువకునికి యిది సవాలుగానే మిగిలిపోతుంది. [47]తన ప్రభువులా సిలువవేయబడడానికి తాను అర్హుడు కానట్టును, తన్ను తల్లక్రిందులుగా సిలువవేయుమని పేతురు అడిగినట్టును పారంపర్యం అంటుంది. [48]"యేసు ప్రేమించిన శిష్యుడు ఎవరైనా," యోహాను రచన రాసినవాడును అతడే (యోహాను 21:24) అందువలన ఈ రచనకు లేఖకుడు యోహానేనని రూఢిగా నమ్ముతాం. [49]"క్రీస్తు జీవితం, 1" చూడు. [50]ప్రథమ పురుషను ఉత్తమ పురుషతోను, ఏక వచనం బహు వచనంతోను ఈ లేఖన భాగం కలుపుతుంది. లేఖన ఉపదేశానికి భిన్నంగా దీన్ని వ్యాఖ్యానించ కూడదు.

[51]నీ తరగతిలో ఈ ఆఖరి ప్రతిపాదనను చర్చించు. తరగతిలో ఉన్నవారు యేసు దేవుని కుమారుడని నమ్మనియెడల, సమస్య ఏమో కనుగొని పరిష్కరించు. [52]ప్రసంగం ఎలా చేయాలో చర్చించు. [53]నేను చెప్పే తరగతులలో పాల్గొన్న విద్యార్థి, "అపొస్తలులకంటె తోమాను నమ్మించడానికి ఎక్కువ రుజువులతోనే సాధ్యమయ్యింది: ప్రభువుని చూడగానే అతడు నమ్మాడు (యోహాను 20:27, 28), వారికైతే ఎక్కువ రుజువులు అవసరమైంది" అని అన్నాడు. [54]Prentice A. Meador Jr., *Sermons for Today,* vol. 2 (Abilene, Tex.: Bibilical Research Press, 1981), 109-16.